సాక్షి కామారెడ్డి

ఆదివారం । 12 । జనవరి । 2025



సీసీ కెమెరాలు కీలకం

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి పేర్కొన్నారు.

- 10లో ▸



కళాశాలలో సమస్యల తిష్ట

తాడ్వాయిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
29.5 /13.1

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జోరుగా చెరుకు క్రషింగ్



నిజాంసాగర్: మాగిలోని గాయత్రి కర్మాగారంలో చెరుకు క్రషింగ్ జోరుగా సాగుతోంది. రోజుకు 3,700 మెట్రిక్ టన్నుల చొప్పున గానుగాడిస్తున్నారు. కర్మాగారం పరిధిలో రైతులు 8 వేల ఎకరాల్లో చెరుకు సాగు చేశారు. పంట కోతకోసం 25 హార్వెస్టింగ్ యంత్రాలు, రవాణాకు 170 లారీలను వినియోగిస్తున్నారు. 70 ముఠాలు చెరుకు కోతలో భాగమవుతున్నాయి. ఈ ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల క్రషింగ్ లక్ష్యం కాగా ఇప్పటివరకు 2.34 లక్షల మెట్రిక్ టన్నులు క్రషింగ్ చేశారు. నవంబర్ 4న క్రషింగ్ ప్రారంభించామని గాయత్రి కర్మాగారం కేన్ మేనేజర్ వెంగళరెడ్డి తెలిపారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో..

సదాశివనగర్: అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరుగా సాగుతోంది. ఇప్పటివరకు 2.17 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు పంటను క్రషింగ్ చేసినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావుతెలిపారు. పర్మిట్లఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.

నేడు సంక్రాంతి ఉత్సవం

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ వద్ద ఆదివారం ఉదయం 7.30 గంటలకు సంక్రాంతి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆర్ఎస్ఎస్ కామారెడ్డి నగర కార్యవాహ శివరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవానికి వక్తగా ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు) సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ హాజరవుతారని పేర్కొన్నారు. స్వయం సేవకులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

'పండుగకు ఊరెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి'


కామారెడ్డి టౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లేవారు దొంగతనాల నివారణ కోసం పలు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సింధుశర్మ ఒక ప్రకటనలో సూచించారు. ఊరికి వెళ్లే సమయంలో ఇంటిలో విలువైన వస్తువులు, నగలు, బంగారం, నగదు ఉంచవద్దని పేర్కొన్నారు. వాహనాలను ఇంటి ఆవరణలో పార్క్ చేసి, తాళాలను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఇళ్ల వద్ద, కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని డీవీఆర్‌ను రహస్య ప్రదేశాల్లో భద్రపరిచి మొబైల్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఎవరిపైనైనా అనుమానం వస్తే డయల్ 100 లేదా కామారెడ్డి పోలీస్ కంట్రోల్ రూమ్ (87126 86133)కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

రిపబ్లిక్ డేకు డ్వాక్రా మహిళకు ఆహ్వానం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు ప్రత్యేక అతిథులుగా వివిధ వర్గాలకు చెందిన వారిని ఆహ్వానించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు కమ్మరి రాధను అతిథిగా ఎంపిక చేశారు. ఈనెల 26న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఆమె పాల్గొననున్నారు.

వడ్డె ఓబన్న జయంతి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర వడ్డెర వృత్తిదారుల సంఘం, బీసీ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం వడ్డె ఓబన్న జయంతి నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింలు, రాజు, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ వెంకట్ గౌడ్, నాయకులు రాజనర్సు, నర్సింలు, శ్రీనివాస్, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాతలు, మోటివేటర్లకు అవార్డులు

కామారెడ్డి అర్బన్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని కళాభారతిలో రక్తదాతలు, మోటివేటర్లకు అవార్డులు అందజేయనున్నారు. ఈ విషయాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు ఓ ప్రకటనలో తెలిపారు.

విజేతలు.. స్ఫూర్తిమంతులు

- కష్టాలకు ఎదురొడ్డి ఉన్నత స్థితికి..
- నేడు జాతీయ యువజన దినోత్సవం

"లెండి.. మేల్కొండి.. గమ్యం చేరే వరకు విశ్రమించకండి. ఎవరి కోసమో.. దేని కోసమో ఎదురు చూడకండి. మీరు చేయగలిగింది చేయండి. ఎవరి మీదా ఆశ పెట్టుకోకండి. మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి.. బలహీన పరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించండి. విజయం సాధించాలంటే పట్టుదల, సంకల్ప శక్తి కావాలి. అటువంటి శక్తిని, సంకల్పాన్ని కలిగి ఉండండి. కష్టపడి పని చేయండి. లక్ష్యసిద్ధికి కృషి చేస్తే గమ్యాన్ని చేరుకుంటారు" అన్న స్వామి వివేకానంద మాటలు అందరికీ ఆదర్శం. ఆయన మాటలు ఎందరిలోనో స్ఫూర్తిని నింపాయి. లక్ష్యం దిశగా వేసే అడుగులు తడబడినా వెరవకుండా లోపాలను సవరించుకుంటూ ముందుకు సాగి ఎంతో మంది తాము ఎంచుకున్న రంగంలో గమ్యాన్ని చేరుకున్నారు. నేడు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువ విజేతలపై సండే స్పెషల్..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



ఐఈఎస్‌కు ఎంపికైన గిరిజన బిడ్డ



బాన్సువాడ మండలం మొగులాన్‌పల్లి తండాకు చెందిన సబావత్ ప్రేమ్‌కుమార్ యూపీఎస్సీ ద్వారా ఐఈఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ విద్యనభ్యసించి గోల్డ్‌మెడల్ సాధించారు. ఢిల్లీ జేఎన్‌యూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. మొదటి ప్రయత్నంలోనే ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు.

టీచర్.. మోటివేటర్.. లెక్చరర్...



రాజంపేటకు చెందిన రమేశ్‌చైతన్య 2012లో ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించారు. ఇంపాక్ట్ ట్రైనర్‌గా ఆయన యువత, విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ మంచి మోటివేటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఉద్యోగం చేస్తూనే తన వాక్చాతుర్యంతో యువతను మేల్కొలుపుతూ తనూ చదువుకున్నారు. ఇటీవలే జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించారు. ఆయన మోటివేషనల్ స్పీచ్‌లతో ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఉన్నతోద్యోగం చేస్తూ పీహెచ్‌డీ పట్టా..



గాంధారి మండలం లొంక తండాకు చెందిన సురేందర్ అటవీశాఖ వాతావరణ విభాగంలో సీనియర్ సైంటిస్ట్‌గా నాగపూర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. గాంధారి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న సురేందర్.. కామారెడ్డిలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. చెన్నైలో ఫారెస్ట్రీలో పీజీ చేసి, అటవీ శాఖలో ఉద్యోగం సాధించారు. జీవ వైవిధ్యం, సంరక్షణ, వాతావరణంలో మార్పులు సరైన సూచనలు అనే అంశంపై ఇటీవల పరిశోధన చేసి, జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. మారుమూల ప్రాంతం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన సురేందర్ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

వ్యవసాయం చేస్తూ టీచర్ కొలువు



రాజంపేట మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన సురేశ్‌రెడ్డి 2015లో డీఎడ్ పూర్తి చేశారు. టీచర్ ఉద్యోగం సాధించాలన్న ఉద్దేశంతో డీఎస్సీ కోసం ఎదురు చూశారు. ఓవైపు తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేస్తూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఇటీవల డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.

వరుస ఉద్యోగాలు సాధించిన అనిల్‌గౌడ్



పిట్లం మండలం తిమ్మానగర్ గ్రామానికి చెందిన సునీత, సత్యనారాయణ గౌడ్ దంపతుల కుమారుడైన అనిల్‌గౌడ్ ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో చదువుకున్నాడు. బీటెక్ పూర్తి చేసిన అనంతరం బ్యాంక్‌లో క్యాషియర్ ఉద్యోగం సాధించాడు. తర్వాత పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికై కొంత కాలం విధులు నిర్వహించాడు. ఉద్యోగం చేస్తూనే గ్రూప్–2 రాసి ఏసీటీవో ఉద్యోగంలో చేరారు. గ్రూప్–1 రాసిన ఆయన మంచి మార్కులు సాధించి ఉన్నత ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు.



విద్యార్థులు వేసిన వివేకానంద చిత్రం

ముగ్గులతో వివేకానందుడి చిత్రం

స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు రంగురంగుల ముగ్గులతో వివేకానందుడి చిత్రాన్ని వేశారు. మూడు గంటలకుపైగా కష్టపడి ఈ చిత్రాన్ని వేసినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని స్కూల్ కరస్పాండెంట్ మారుతి, ఉపాధ్యాయులు అభినందించారు.

– కామారెడ్డి టౌన్

పథకాల అమలుకు ఏర్పాట్లు చేయండి

- రేపటిలోగా ఇందిరమ్మ సర్వే పూర్తి కావాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



టెలీకాన్ఫరెన్స్‌లో మండల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కోసం ఈనెల 15 నాటికి సన్నాహకాలు పూర్తిచేయాలన్నారు. గుట్టలు, రోడ్లు, నాలా కన్వర్షన్, భూసేకరణ, లే అవుట్, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను పరిశీలించాలన్నారు. ఈనెల 16 నుంచి 20 వరకు క్షేత్ర పర్యటన చేసి డాటా సిద్ధం చేయాలని, దానిపై గ్రామ సభలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవాలన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలు కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన డాటాను సిద్ధం చేయాలన్నారు. ఆధార్ నంబర్ మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారు, గతంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి డాటాను సిద్ధం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సర్వేను సూపర్ చెక్ చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు రంగనాథ్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాల బిల్లులు వచ్చేదెప్పుడో?


- రెండు నెలలుగా పెండింగ్‌లో..
- జిల్లాలో రూ. 7.50 కోట్లు బకాయి
- ఇబ్బంది పడుతున్న పాడి రైతులు



మోతె గ్రామంలోని విజయ డెయిరీలో పాలు పోస్తున్న రైతులు

లింగంపేట : విజయ డెయిరీలో పాలు విక్రయించిన పాడి రైతులకు రెండు నెలలుగా బిల్లులు రావడం లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. విజయ డెయిరీ జిల్లాలో సుమారు 200 పాల కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల ద్వారా సుమారు 20 వేల మంది పాడి రైతులనుంచి పాలు సేకరిస్తోంది. లింగంపేట, తాడ్వాయి, గాంధారి, దోమకొండ, భిక్కనూరు, రాజంపేట, బీబీపేట తదితర మండలాలనుంచి ఎక్కువగా పాల సేకరణ జరుగుతోంది. కేంద్రంలో పాలు విక్రయించే వారికి నిబంధనల ప్రకారం 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే రెండు నెలలుగా పాడి రైతులకు బిల్లులు రావడం లేదు. దీంతో జిల్లాలో రూ. 7.50 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. పాలు విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓవైపు యాసంగి పంటల సాగు పనులు జోరందుకోవడం, మరోవైపు పండుగ రావడం, ఇంకోవైపు పాల బిల్లులు రాకపోవడంతో చేతిలో డబ్బులు లేక ఇబ్బందిపడుతున్నామని పాడి రైతులు పేర్కొంటున్నారు. బిల్లులు రాకపోవడంతో పశువులకు దాణా, తవుడు, గడ్డి కొనుగోలు చేయడానికి అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పాడి రైతులకు బిల్లులు చెల్లించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిల్లులు రావడం లేదు



నేను మూడేళ్లుగా విజయ పాలకేంద్రంలో పాలు పోస్తున్నాను. రోజూ ఉదయం, సాయంత్రం వేళలలో 50 లీ టర్లు తెస్తున్నాను. బిల్లులు రాక రెండు నెలలయ్యింది. రూ. 1.20 లక్షల వరకు పాల బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో పశువులకు దాణా, గ డ్డి, తవుడు కొనడానికి ఇబ్బందిగా ఉంది. వెంటనే పాల బిల్లులు వచ్చేలా చూడాలి.

– మర్రి గంగారెడ్డి, పాడి రైతు, మోతె

అప్పుల పాలవుతున్నాం



నాకు నాలుగు ఆవులున్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం కలిపి 20 లీటర్లు కేంద్రానికి విక్రయిస్తాను. రెండు నెలలకు కలిపి రూ. 50 వేల వరకు రావాల్సి ఉంది. పాల బిల్లులు రాకపోవడంతో పశుపోషణకు, యాసంగి పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి, పాల బిల్లులు రెగ్యులర్‌గా వచ్చేలా చూడాలి.

– మాసుల సాయిలు, పాడి రైతు, మోతె

మూడు బిల్లులు రావాల్సి ఉంది

విజయ డెయిరీలో పాలు విక్రయించేవారికి 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లిస్తాం. ప్రస్తుతం మూడు బిల్లులు బకాయి ఉన్నాయి. జిల్లాలోని పాడి రైతులకు రూ. 7.50 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ విషయాన్ని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాం. బకాయిల విడుదలకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే బిల్లులు వచ్చే అవకాశాలున్నాయి.

– తిరుపతిరెడ్డి, విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు

ఘనంగా ఉర్సు ప్రారంభం



ఉర్సు గంధాన్ని తెస్తున్న ఎమ్మెల్యే పోచారం

వర్ని: వర్ని మండలంలోని బడాపహాడ్ ఉర్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. మండలంలోని జలాల్పూర్‌లో దర్గా ప్రతినిధుల ఇంటి నుంచి ఉర్సు నైవేద్యాన్ని తీసుకువచ్చి గ్రామ చావిడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కవ్వాలి ఇతర సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ప్రార్థనలు నిర్వహించి షాదుల్లా బాబాకు సమర్పించే నైవేద్యాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి తలపై పెట్టుకుని ఉర్సు ప్రారంభించారు. ఉర్సు గంధాన్ని (నైవేద్యం) ఒంటె, గుర్రంపై ఉంచి జలాల్పూర్ నుంచి బడాపహాడ్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం బడా పహాడ్ దర్గాపై ఉన్న శాదుల్లా బాబాకు సమర్పించారు. సోమవారం వరకు ఉత్సవాలు జరగనున్నాయి. కాగా తొలిరోజు ఆశించిన స్థాయిలో భక్తులు రాలేదు. ఇటీవల దర్గా వద్ద పూజారుల దోపిడీ, కనీస సౌకర్యాలు లేకపోవడంతో బడాపహాడ్‌కు భక్తులు రావడానికి మొగ్గు చూపడం లేదు. ఉత్సవాల సందర్భంగా గుట్ట వద్ద కనీస సౌకర్యాలు కల్పించడంలో వక్ఫ్ బోర్డు విఫలమైంది.

కిక్కిరిసిన మేకల సంత

నవీపేట : నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలో శనివారం జరిగిన మేకల సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసింది. మంగళ, బుధవారాలలో సంక్రాంతి భోగి, కనుమ పండుగ సంబరాలు జరగనుండడంతో ఈ వారం క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. కనుమ రోజున ప్రత్యేకంగా మాంసాహార విందు భోజనానికి ప్రాధాన్యత ఇస్తారు. దీంతో శనివారంనాటి మేకల సంతలో సందడి నెలకొంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వ్యాపారులు మేకలతో శుక్రవారం రాత్రే సంతకు చేరుకున్నారు. అయితే సంత ప్రాంగణం ఇరుకుగా ఉండడం, బాసర రహదారికి ఇరువైపులా క్రయవిక్రయాలు జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సంతలో రూ. 4 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.



క్రయవిక్రయదారులతో సందడిగా ఉన్న నవీపేట మేకల సంత ప్రాంగణం

క్లుప్తంగా

జీజీహెచ్ పరిస్థితులపై ధన్‌పాల్ ఆగ్రహం

- అక్రమాలపై విచారణ చేయించాలని కలెక్టర్‌కు వినతి

నిజామాబాద్ నాగారం: ఫిట్స్‌తో బాధ పడుతున్న తన భార్యను శుక్రవారం చికిత్స కోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వచ్చిన వ్యక్తికి సిబ్బంది చుక్కలు చూపించిన ఘటన చర్చనీయాంశమైంది. స్ట్రెచర్‌ను తీసు కొచ్చే సిబ్బంది పట్టించుకోకపోవంతో రోగిని బంధువులే భుజాలపై వేసుకుని ఆస్పత్రిలోనికి మోసుకెళ్లారు. ఇంత జరుగుతున్నా పర్యవేక్షణ చేయాల్సిన ఆస్పత్రి అధికారులు పట్టింపులే కుండా వ్యవహరించారు. జీజీహెచ్‌లో నెల కొన్న పరిస్థితులపై ఇటీవల నిర్వహించిన సమీ క్షలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారా యణ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అక్రమాలపై విచా రణ చేయించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హను మంతుకు విన్నవించారు. 2023 డిసెంబర్ నుంచి ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు, ఖర్చులు, గతేడాది అన్ని విభాగాల్లో అవుట్ సోర్సింగ్ ద్వారా రిక్రూట్ అయిన ఉద్యోగుల సమాచారాన్ని సేకరించాలని కోరారు. వైద్య పరికరాల సేకరణ కోసం నిర్వహించిన వేలం, బయోమెట్రిక్ యాక్సెస్ చేసిన ప్రదేశాలతో సహా గత మూడు నెలల నుంచి అన్ని విభా గాల అధిపతులు, కాంట్రాక్ట్ వైద్యులకు బయో మెట్రిక్ నివేదికలు, కొంత మంది వైద్యులు హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి బయో మెట్రిక్ యాక్సెస్ చేస్తున్నారన్నారు. అంతర్గత సిబ్బంది, అంబులెన్సులు, నగరంలోని రెండు ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్, రాత్రి వేళల్లో అల్ట్రా సానోగ్రఫీ చేయకపోవడం, రేడియాలజి స్టులు అందుబాటులో ఉంటున్నారా?, పోస్టు మార్టం రిపోర్టులు ఆలస్యం చేయడం, ఆరోగ్య శ్రీ నిధులు, రూ.10కోట్ల నష్టం తదితర అంశా లపై విచారణ చేయించాలని కోరారు.

సోషల్ టీచర్ల ఎడ్యుకేషన్ టూర్



బోధన్: పట్టణంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీసీ) స్కూల్ కాంప్లెక్స్ పరి ధిలోని సోషల్ సబ్జెక్టు టీచర్లు శనివారం ఎడ్యు కేషన్ టూర్‌లో భాగంగా క్షేత్ర పర్యటనకు వెళ్లారు. వరంగల్ జిల్లాలోని కాకతీయుల కోట, వెయ్యి స్తంభాల గుడి, లక్నవరం చెరువు, రామప్ప గుడిని సందర్శించారు. స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి సంజీవ్ కుమార్, ఉపాధ్యాయులు పాటల శ్రీనివాస్, శ్రీలక్ష్మి, బాలాజీ, అబ్బయ్య, రాజన్న, కిశోర్, స్వరూపా రాణి, పద్మజ్యోతి, శిరీష, శ్యామల, లీల తదిత రులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కోసం మాధవరావు పోరాటం



నిజామాబాద్ సిటీ: మానవ హక్కుల ఉద్యమ కారుడు గొర్రెపాటి మాధవరావు జీవితాంతం పీడిత ప్రజల కోసమే పోరాడారని, ఆయన జీవితం పీడిత ప్రజలకే అంకితమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రం లోని ఎల్లమ్మగుట్టలోని మాధవరావు నివాసం లో సంస్మరణ సభ నిర్వహించారు. మాధవ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు.

న్యాయవాదిగా నకిలీ ఎన్‌కౌంటర్ బాధితు లకు కోర్టు ద్వారా నష్టం ఇప్పించిన ఘనత మాధవరావుదేనని అన్నారు. తన రచనలతో ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాల వైపు నడి పించారన్నారు. భారత రాజ్యాంగాన్ని పూర్తిగా అవపోసాన పట్టిన గొప్ప మేధావి గొర్రెపాటి మాధవరావు అని కొనియాడారు. అనంతరం పలువురు నాయకులు సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కృష్ణ, వేములపల్లి వెం కటరామయ్య, జీవన్ కుమార్, ఆకుల పాపయ్య, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ట్రస్ట్ సభ్యులు, మానవ హక్కుల వేదిక నాయకులు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, వామపక్షాల నాయకులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

పిల్లలూ.. పతంగులతో పైలం

- చైనా మాంజాతో పొంచిఉన్న ప్రమాదం
- తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి
- మాంజాతో పక్షులకూ ఇబ్బందులే..



రాజంపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజంపేట/బాన్సువాడ రూరల్: సంక్రాంతి సెల వులు రావడంతో పిల్లల్లో ఎక్కడా లేని ఆనందం కని పిస్తోంది. చిన్నాపెద్దా తేడాలేకుండా పతంగులు ఎగరేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు పతంగుల దుకాణాల నిర్వాహకులు ప్రమాదకర మైన చైనా మాంజాను విక్రయిస్తున్నారు. మనుషు లతోపాటు పక్షులకు చైనామాంజాతో ప్రమాదం పొంచి ఉంది. జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద రోడ్డుకు ఇరువైపులా, బాన్సువాడ పట్టణంతోపాటు మండల కేంద్రాల్లో పతంగుల దుకాణాలు వెలి శాయి. అన్ని ప్రాంతాల్లో పతంగుల సందడి నెల కొంది. చైనా మాంజా వినియోగించుకుండా పిల్లల కు తల్లిదండ్రులు అవగాహన కల్పించాల్సిన అవ సరం ఎంతైనా ఉంది. పతంగులు ఎగురవేసే సమ యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి.

సాధారణ మాంజానే వాడాలి..

పతంగులు ఎగరేసేందుకు చైనా మాంజా కాకుండా సాదా మాంజానే వాడాలి. సాదా మాంజాతో అం తగా ప్రమాదాలు ఉండవని, పక్షులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవని పలువురు సూచి స్తున్నారు. సాధారణ మాంజా ధరలతో పోలిస్తే చైనా మాంజా ధర ఎక్కువగా ఉంటుంది. ఒక్క చర్కా రూ.300 నుంచి రూ.500 వరకు విక్రయిస్తు న్నారు. సాధారణ మాంజాలు అందుబాటు ధర ల్లోనే ఉన్నాయి.

విద్యుత్ తీగలతో ప్రమాదం..

భవనాలు, పిట్టగోడలు, బాల్కానీలపై నిలబడి పతంగులు ఎగురవేసేప్పుడు జాగ్రత్తలు పాటిం చాలి. చిన్నచిన్న గల్లీలు, భారీ భవన సముదా యాలు, విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్ల సమీ పంలో గాలిపటాలు ఎగురవేసే సాహసం చేయ కూడదు. పతంగులు విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పడితే తీసుకునే ప్రయత్నం చేయొద్దు. ఇలా తీసుకునే ప్రయత్నంలో చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్ల వెంట గాలి పటాల కోసం పరుగులు పెట్టనీయొద్దు. మాం జా మెడకు బిగుసుకుపోవడంతో గొంతు దగ్గర గాయాలవుతున్నాయి. దాబాలపై కాకుండా మైదానాల్లో పతంగులను ఎగురవేయాలి.

అమ్మితే చర్యలు



ప్రమాదకర మాంజాలు వాడి నా, సరఫరా చేసినా వన్యప్రా ణి సంరక్షణ చట్టం(1986) కిం ద జైలు శిక్ష లేదా రూ.లక్ష జరి మానా విధించడం జరుగుతుం ది. పక్షులకు ప్రమాదం అని ప్ర భుత్వం సింథటిక్ చైనా మాంజాలను నిషేధించిం ది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి పం డగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి.

– రమేశ్, ఎఫ్‌ఆర్‌వో, రాజంపేట

విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబురాలు



ఎస్పీఆర్ స్కూల్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



భిక్కనూరులోని చైతన్య విద్యానికేతన్‌లో..

జిల్లా కేంద్రంలోని పలు ప్రయివేట్ విద్యాసంస్థల్లో శనివారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీఆర్ స్కూల్, ఆర్యభట్ట, పీజే ఆర్ డిగ్రీ, మంజీరా డిగ్రీ, ఆర్కే, ఎస్ఆర్కే కళాశాల, లిటిల్ స్కాలర్ స్కూల్స్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తుగా సంక్రాంతి పం డుగను జరిపారు. అలాగే విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, బాలురకు గాలిపటాలు ఎగిరివేయడం వంటి పోటీలు నిర్వహించారు. విద్యాసం స్థల ఆవరణల్లో భోగి మంటలు ఏర్పాటు చేశారు. భిక్కనూరులోని పలు స్కూళ్లలోనూ సంక్రాతి వేడుకలు నిర్వహించారు.–కామారెడ్డి టౌన్



భిక్కనూరులోని విజ్ఞాన్ పాఠశాలలో..



ఆర్కే కళాశాలలో..



ఆర్యభట్ట కళాశాలలో ఏర్పాటు చేసిన భోగి మంటలు

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో యువ కుడు మృతి చెందిన ఘటన మండలం లోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లారె డ్డిలోని ప్రైవేట్ ఆస్ప త్రిలో చికిత్స పొందుతున్న తమ గ్రామానికి చెం దిన వ్యక్తిని పరామర్శించేందుకు నిజాంసాగర్ మం డలం గోర్గల్ గ్రామానికి చెందిన పీరని కాశయ్య (40) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బైక్‌పై రాత్రి 9 గంటల సమయంలో బయల్దేరాడు. శనివారం రాత్రి 10 గంటల సమ యంలో ప్రమాదవశాత్తు ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివా రులోని మూలమలుపు వద్ద బైకు అదుపుతప్పి మట్టి కుప్పలను ఢీకొట్టి రాళ్లపై పడి ఘటనాస్థలం లోనే మృతి చెందాడు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వర్ని చౌరస్తా వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెంది నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. శనివారం సాయంత్రం వర్ని చౌరస్తా మీదుగా ప్రయాణిస్తుం డగా సాయినగర్‌కు చెందిన పీర్‌సింగ్(35) వస్తుం డగా ఎదరుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘట నలో తీవ్రగాయాలపాలైన పీర్‌సింగ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చేపల వేటకు వెళ్లి..



మృతదేహాన్ని ఒడ్డుకు తెస్తున్న గజ ఈతగాళ్లు

రామారెడ్డి: మండలంలోని భట్టుతండా చెరువులో చేపలను వేటాడేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమా దవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భట్టు తం డా గ్రామానికి చెందిన రమావత్ రవీందర్(28) శుక్రవారం మధ్యాహ్నం చెరువులో చేపలను వేటాడేందుకు వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగిపోయాడు. స్థానికులతోపాటు జాలర్లు శుక్రవారం మధ్యా హ్నం నుంచి గాలించినప్పటికీ ఫలితం లేకుండాపో యింది. శనివారం మధ్యాహ్నం గజ ఈతగాళ్లకు రవీందర్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి ఇద్దరు భార్యలు కాగా, పెద్ద భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నామని ఎస్సై తెలిపారు.

మురికి కాలువలో పడి మృతి

ధర్పల్లి: ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలం లోని హొన్నాజీపేట్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన అంతే జగదీశ్వ ర్(42) కూలి పని చేస్తూ జీవించేవాడు. గొడవ కారణంగా నాలుగేళ్ల క్రితం భార్య అతడిని వదిలి కూతురితో కలిసి పుట్టింటికి వెళ్లిపోయిం ది. అప్పటి నుంచి జగదీశ్వర్ మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన జగదీశ్వర్.. మళ్లీ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం మురికి కాలువలో జగదీశ్వర్ మృత దేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారాన్ని అం దించారు. మృతుడి తల్లి గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నవీపేట: మండలంలోని జన్నేపల్లికి చెందిన షేక్ కరీమాబీ(66) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. ఈనెల 10వ తేదీన జన్నేపల్లి గ్రామంలోని రహదారిపై వెంట కరీమాబీ నడుచు కుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన కరీమాబీని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. మృతురాలి మనవడు నిఖత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్ బస్టాండ్ ప్రాంతంలో పీడీఎస్ బియ్యాన్ని ఒకటో టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఆటోలో తరలిస్తున్న 9క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని ఆటోను ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ ..

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి సమీపంలో ఉన్న మొఘల్ పూర్, బోధన్ మండలం కొప్పర్గ నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్‌తోపాటు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వాహనాలు పట్టుబడ డంతో స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దా ర్‌కు అప్పగిస్తామని తెలిపారు.

అటవీ భూమిని ఆక్రమించిన వారిపై కేసు

సిరికొండ: సిరికొండ రేంజ్ పరిధిలోని రాంచంద్ర పల్లి బీట్ కంపార్ట్‌మెంట్ నంబర్ 391లో అటవీ భూమిని ఆక్రమించిన చింతల్‌తండాకు చెందిన 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి రేం జర్ రవీందర్ శనివారం తెలిపారు. అటవీ భూము లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కారు చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతంనగర్‌కి చెందిన ఎనుగందుల పవన్‌కుమార్ కు చెందిన కారును దుండగులు ఎత్తు కెళ్లినట్లు ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. పవన్‌కుమార్ ఈనెల 9న రాత్రి హైదరాబాద్‌కు వెళ్తూ ఇంటి ముందు ఐ10 కారును పార్క్ చేశా డన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయనకు కారు కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికాడ న్నారు. అయినప్పటికీ కారు లభించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం





దోమకొండలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి.. కంచర్లలో మాట్లాడుతున్న ఏఎస్పీ

దోమకొండ/భిక్కనూరు: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36 సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమాన మన్నారు. రూ.7లక్షలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీని అభినందిం చారు. అలాగే భిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. భిక్కనూరు సీఐ సంపత్, ఎస్ఐ అంజనేయులు, ఏఎస్సై సుబ్రమణ్యాచారి, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, చాముండేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ సిద్దారెడ్డి, బీజేపీ మండల అ ధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నల్లవు అం జలి, నాయకులు బొమ్మెర శ్రీను, నల్లవు శ్రీనివాస్, చిట్యాల రాజిరెడ్డి, కొండ అంజం పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

భిక్కనూరు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబం ధనలు పాటించి, వాహనాలు నడపాలని కామారెడ్డి అసిస్టెంట్ ఎస్పీ చైతన్య రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో శనివారం రోడ్డు భద్రత ఉత్సవాల్లో సం దర్భంగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అట్టహాసంగా 'సంక్రాంతి క్రీడాపోటీలు'



దేవునిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



రాంపూర్ తండాలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని పలు మండలాలు, గ్రా మాల్లో సంక్రాంతి సెలవుల సందర్భంగా స్థానిక యువజన సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో క్రీడాపోటీలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. వి ద్యార్థులు, యువకుల కోసం ఆర్‌పీఎల్ టోర్నీ నిర్వ హిస్తున్నట్లు బాన్సువాడ మాజీ వైస్ ఎంపీపీ హరి సింగ్ శనివారం తెలిపారు. పోటీల్లో భాగంగా క్రికె ట్‌తో పాటు ముగ్గుల పోటీలు, ఇతర ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. కా మారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామం లో బీజేపీ నేత కాసర్ల రవీందర్ తండ్రి కాసర్ల శివరా జయ్య జ్ఞాపకర్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెం ట్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి ప్రారంభించారు. బీబీపేట మండలంలోని బీ బీపేట క్రికెట్ క్లబ్ అధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ను ఎస్సై ప్రభాకర్ ప్రారంభించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట సమీపంలో కాంగ్రెస్ నాయకులు మండల క్రికెట్ టోర్నీని ప్రారంభిం చారు.బాన్సువాడ మండలంలోని కొత్తాబాది గ్రా మంలో నిర్వహిస్తున్న కొత్తాబాది ప్రీమియర్ లీగ్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి.



బీబీపేటలో..



గోపాల్‌పేటలో..



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ ముగింపు



శిక్షణ పొందిన కేడెట్లతో లెఫ్టినెంట్ కల్నల్ విష్ణుప్రసాద్ నాయర్

ఎడపల్లి(బోధన్): మండలంలోని జాన్కంపేట్ సీటీ సీలో 12వ తెలంగాణ బెటాలియన్ వార్షిక శిక్షణ శి బిరం ముగింపు కార్యక్రమాన్ని లెఫ్టినెంట్ కల్నల్ విష్ణుప్రసాద్ నాయర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వ హించారు. క్యాంప్‌లో నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, సంగారెడ్డికి చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు శిక్ష ణ శిబిరం కొనసాగింది. కేడెట్లు రానున్న ఎగ్జా మ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి గ్రేడింగ్ సాధించాలని లెఫ్టినెంట్ కల్నల్ అన్నారు. ముగింపు కార్యక్రమంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్య క్రమాలు అలరించాయి.

చెట్టును ఢీకొన్న ఆటో : ముగ్గురికి గాయాలు



బాధిత మహిళను పరామర్శిస్తున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తు మ్మెద గ్రామసమీపంలో వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఓ ఆటో శనివారం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. స్థాని కులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండ లంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన పలువురు మహిళాకూలీలు వ్యవసాయ పనుల కోసం ఆటోలో శనివారం ఉదయం మాల్తుమ్మెద గ్రామా నికి బయల్దేరారు. ఆటో మాల్తుమ్మెద గ్రామ సమీ పంలోకి చేరుకున్న తర్వాత అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో సునీత అనే మహిళకు తీవ్రగాయాలు కాగా, భాగ్యలక్ష్మి, లావణ్య అనే మహిళలకు స్వల్పగాయా లయ్యాయి. సునీతను మెరుగైన చికిత్స కోసం మెదక్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కాంగ్రెస మండలాధ్యక్షుడు, ధర్మారెడ్డి గ్రామ మాజీసర్పంచ్ శ్రీధర్‌గౌడ్ మండల కేంద్రం లోని ప్రైవేట్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శిం చారు. ఆయనవెంట యూత్‌కాంగ్రెస్ మండలాధ్య క్షుడు శ్రీరాంగౌడ్ ఉన్నారు.

కోటగిరిలో పశువుల పాక దగ్ధం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో పశువుల పాక దగ్ధమై 18 గేదెలకు గాయాలయ్యాయి. షేక్ హైమద్‌కు చెందిన పశువుల పాకకు శుక్రవారం రాత్రి మంటలు అంటుకోవడంతో గమనించిన స్థానికులు వెంటనే ఆయనకు సమాచారం అందిం చారు. ఐదు గేదెలకు తీవ్రగాయాలు కాగా, 13 గేదెలకు స్వల్ప గాయాలయ్యాయి. శనివారం ఉదయం మండల పశువైద్యాధికారి సురేశ్‌కుమార్ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి అగ్ని ప్రమాదం లో గాయపడిన పశువులకు చికిత్స అందించారు.

పేకాటస్థావరాలపై దాడులు

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని ధర్మోరా, గాండ్లపేట్‌లో కొనసాగుతున్న పేకాట స్థావరాలపై దాడులు చేసి 13 మందిని అదుపులోకి తీసుకు న్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ధర్మోరా శివారులోని పేకాటస్థావరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.5,930 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే గాండ్లపేట్ శివారులో ఐదుగురిని అదు పులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.77,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబ డిన వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఎక్సెల్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పెద్ద పోతంగల్ బస్‌స్టాప్ వద్ద ట్రాక్టర్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టింది. శనివారం చోటుచేసుకున్న ఈ ఘట నలో ఎక్సెల్ నడుపుతున్న పెద్ద బీరయ్యకు గాయా లైనట్లు 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ కమలా కర్, పైలెట్ నరేశ్ తెలిపారు. సీతాయిపల్లికి చెందిన పెద్దబీరయ్య గాంధారికి వెళ్తుండగా ప్రమాదం జరి గిందని, బీరయ్య తల, చెవికి గాయాలయ్యాయ న్నారు. బీరయ్యను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించామని, బాధితుని వద్ద లభించిన రూ.6వేల నగదును ఆయన బంధువు రమేశ్‌కు అప్పగించామని తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ఎడపల్లి (బోధన్): మండలంలోని ఠాణాకలాన్ గ్రామానికి చెందిన శ్రీకాంత్, లోకేశ్ బైక్‌పై స్వగ్రామం నుంచి జాన్కంపేట్ వైపు వెళ్తుండగా జాన్కంపేట శివారులో ఉన్న జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం వద్ద బైక్ అదుపు తప్పింది. రోడ్డుపై పడిపో యిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.